# మౌనం

హోతా పద్మినీదేవి

"నువ్వు ఊరికి వెళ్ళి నాలుగు రోజులయింది. నువ్వు లేని ప్రతీ క్షణం నాకొక యుగంలా అనిపించడం లేదెందుకని? నువ్వు నా పక్కన వున్నప్పుడూ నేను ఒంటరినే. ఇప్పుడూ నేను ఒంటరినే. మనిద్దరి మధ్య అఘాతం లాంటి మౌనం కంటే ఇప్పటి నిశ్శబ్దమే నాకు బాగుంది. నువ్వు నా పక్కన లేవనే బాధ నాలో లేదు. నీ ఆబ్సెన్స్‌ని నేను ఫీలవడం లేదు. నాలో సున్నితమైన భావాలు చచ్చిపోతున్నాయా? నేను నిన్ను ఇదివరకటిలా ఎందుకు ప్రేమించలేకపోతున్నాను?"

డైరీ మూసి పెన్ కేప్ పెట్టి కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుని కూర్చుంది మాధుర్య. మూసిన కనురెప్పల చాటు నుండి వ్యధాభరితమైన ఆమె మనసు మారుమూల పొరలలో నుంచి ఒక కన్నీటి బొట్టు ఆమె చెక్కిలిని ఆర్ద్రంగా స్పృశించింది.

* * *

విష్ణు ఆఫీసు నుంచి ఇంటికొస్తూనే నేరుగా బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. కాఫీ కప్పుతో ఆ గదిలోకి వచ్చిన మాధుర్య పడుకుని వున్న భర్తని చూసి "అలా వున్నారేం?" అనడిగింది.

"తలనెప్పి... ఒళ్ళంతా నెప్పులు, జ్వరం వచ్చేలా వుంది" అన్నాడతను కళ్ళు తెరవకుండానే.

కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ అంది. "కాఫీ ఇక్కడ పెట్టాను. తాగి పడుకోండి" అనేసి గదిలో నుంచి బయటికెళ్ళింది.

విష్ణుకి కళ్ళు తెరవాలని, లేచి కాఫీ తాగాలని లేదు. అతని శరీరంలోని ఏ అవయవమూ అందుకు సహకరించడం లేదు. కానీ వేడి కాఫీ తాగితేనయినా తలనెప్పి తగ్గుతుందేమోనని బలవంతాన లేచి కాఫీ తాగాడు.

'మాధుర్య గదిలోకి వస్తే బాగుండును. తన నుదుటికి పెయిన్ బామ్ రాస్తే బాగుండును' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

హాలులో టీవీలోంచి ఏవో డైలాగులు వినబడుతున్నాయి. ఏదో సినిమా కాబోలు. 'మాధుర్య టీవీ చూస్తున్నట్టుంది' విష్ణు కళ్ళు మూసుకున్నాడు. తల పగిలిపోతున్నట్టు నెప్పి. జ్వరం వచ్చినట్టుంది. ఒళ్ళంతా సలసలలాడుతోంది. తననిక్కడ ఇలా వదిలేసి ఆమె టీవీ చూస్తోంది. మనసు చివుక్కుమంది. కొద్దిసేపటికి అతనికి తెలియకుండానే మనసు ఆలోచించే స్థితిని దాటి మగతలోకి జారుకుంది.

* * *

నుదుటిపై చల్లని స్పర్శ. ఉడుకులోన్ వాసన. షర్టు బటన్స్ విప్పారెవరో. తడిగుడ్డతో ఒళ్ళంతా తుడుస్తూన్నారు. బహుశా టెంపరేచర్ తగ్గడానికి కాబోలు.

"మధూ! మాధుర్యా!"

కళ్ళు విప్పడానికి విఫల ప్రయత్నం చేస్తూ కలవరిస్తున్నట్టు అన్నాడు.

"మేడమ్ బయట ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్నారు. పిలవమంటారా?" మృదువైన స్వరం అస్పష్టంగా...

ఎవరిదా స్వరం?

"మీరెవరు?" తనకి సపర్యలు చేస్తున్న ఆమె ఎవరో తెలుసుకోవాలనే కుతూహలంతో అడిగాడు.

"నర్స్‌ని"

'జ్వరంతో బాధపడుతున్న తనని నర్సుకి వదిలేసి తను ఫ్రెండ్స్‌తో బాతాఖానీ కొడుతోందా?' అతని మనసులో బాధావేదనలు.

అతని ప్రమేయం లేకుండానే మళ్ళీ మగతలోకి జారుకున్నాడు.

* * *

మూడు రోజుల తరువాత విష్ణుకి జ్వరం తగ్గింది. దిండునానుకుని మంచం మీద నిస్సత్తువగా కూర్చున్నాడు. మాధుర్య గదిలోకి వచ్చింది.

"జ్వరం తగ్గింది. ఇవాళ అన్నం తినవచ్చని డాక్టరు చెప్పారు. చారన్నం తిందురుగాని. ఇక్కడికి తీసుకురానా? డైనింగ్ టేబిల్ దగ్గరకి వస్తారా?"

"రాలేను...ఇక్కడికి తీసుకురా"

"సరే" ఆమె కిచెన్‌లోకి వెళ్ళి అయిదు నిముషాల తరువాత బౌల్‌లో చారన్నం కలిపి, స్పూన్, మంచి నీళ్ళ గ్లాసు అతను అన్నం, తిన్నాక వేసుకోవలసిన టేబ్లెట్సు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"తిని నిద్రపోకండి. మళ్ళీ జ్వరం వస్తుంది" హెచ్చరికగా అంది.

"మధూ! కాస్సేపు నా దగ్గర కూర్చో" అర్థింపుగా అన్నాడు.

"మీరు ఎలాగా ఇంట్లోనే వుంటారు కదా అని మిసెస్ సిన్హాతో షాపింగ్‌కి వస్తానని చెప్పాను. అయ్యో! ఇప్పటికే ఆలస్యమయిపోయింది. వస్తానేం" అతి మామూలుగా చెప్పి హడావుడిగా వెళ్లిపోయింది.

షాకింగ్‌గా ఆమె వెళ్ళిన వైపు చూస్తూండిపోయాడు.

'తనకి కాస్త తలనెప్పి వస్తే హడావుడి పడిపోయే మాధుర్య, ఎందుకిలా ప్రవర్తిస్తోంది. తనని పట్టించుకోదేం?'


అన్నం తినాలని లేదు. కానీ తినాలి. జ్వరం తగ్గినా కాలు, చెయ్యి కదపలేనంత నీరసం. తను మామూలుగా అయి రొటీన్‌లో పడాలంటే ఏదో ఒకటి తినాలి. బిజినెస్. కొత్త కాంట్రాక్టులు. ఎత్తులకి పై ఎత్తులు. ఎచీవ్‌మెంట్. కొత్త ఉత్సాహం. విజయం తాలూకు ఆనందం. అందరూ, తనని చూసి ఈర్ష్య పడాలి. బౌల్ చేతిలోకి తీసుకుని మెల్లిగా తినసాగాడు. నోరు చేదుగా వుంది. మందుల ప్రభావమో లేక జ్వరం వలనో తెలియదు. ఎలాగో అన్నం తిన్నాననిపించి నీళ్ళు తాగి టేబ్లెట్స్ మింగి హాలులోకి వచ్చాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఒంటరితనం భరింపరానిదిగా వుంది. తనకో తోడుకావాలి.

'మాధుర్య ఇంట్లో వుంటే బాగుండును. అయినా మధులో వున్నట్టుండి ఈ మార్పేమిటి? తనకి కాస్త తలనెప్పి వస్తే తన చేత టేబ్లెట్ మింగించి పక్కన కూర్చుని నుదుటికి పెయిన్ బామ్ రాసి నిమిషానికోసారి తగ్గిందా అని ఆదుర్దాని ప్రకటించే మధు..మూడు లంఖణాలు చేసినా తను అన్నం తినేప్పుడయినా దగ్గర వుండకుండా ఫ్రెండ్‌తో షాపింగ్‌కి వెళ్తుందా?' అసహనంగా నిట్టూర్చి రిమోట్ చేతిలోకి తీసుకున్నాడు.

ఛానల్స్ మారుస్తున్నాడు. ఏదీ చూడబుద్ధి కావడం లేదు. మనసులో ఒకే ఆలోచన. అది మనసుని చెదపురుగులా తినేస్తోంది. ఒంటరితనం. నిశ్శబ్దం పిచ్చెక్కిపోతోంది.

మూడు గంటలకి ఇంటికొచ్చింది మాధుర్య. ఇంటికి వస్తూనే కిచెన్‌లోకి వెళ్ళి కాఫీ కలిపింది. అతనికో కప్పు ఇచ్చి తనో కప్పు తీసుకుని టి.వి. ఆన్ చేసింది.

ఏదో తెలుగు డైలీ సీరియల్ వస్తోంది. ఆమె



టి.వి. చూడ్డంలో ఎంతగా లీనమయిందంటే విష్ణు రెండుసార్లు పిలిస్తేనే గానీ పలుకలేదు.

“ఏమిటి?” టి.వి. వాల్యూమ్ తగ్గిస్తూ అడిగింది.

“కాస్సేపు టీవీ కట్టేసి నాతో మాట్లాడొచ్చుగా?” గోముగా అడిగాడు.

“ఏం మాట్లాడను?” టి.వి. మీద నుంచి దృష్టి మరల్చకుండానే అడిగింది.

“నాకు బోర్‌గా వుంది”

“నేనేం చెయ్యను? మీరు కూడా టి.వి. చూడండి కావాలంటే?”

విష్ణు నోట మాట రావడం లేదు. ఆమె తనని నిర్లక్ష్యం చేస్తోందనే భావనని తట్టుకోలేకపోతున్నాడు.

“నాకు నీరసంగా వుంది. కాస్సేపు నా దగ్గర కూర్చో”

“నేను మీ దగ్గర కూర్చుంటే మీకు నీరసం తగ్గిపోతుందా?” వ్యంగ్యంగా అడిగింది.

అతను నిస్తేజుడయి ఆమెని చూస్తున్నాడు. ఉన్నట్టుండి ఆమెలో వచ్చిన ఈ మార్పుకి నివ్వెరపోతున్నాడు.

‘ఎందుకిలా మారిపోయావ్ మధూ?’ అనుకున్నాడు బాధగా.

★ ★ ★

రాత్రి పదిన్నర.

పోర్టికోలో కారు ఆపి లోపలికి వచ్చాడు విష్ణు.

మాధుర్య అతని రాకని గమనించనట్టే టి.వి. చూస్తోంది. అతను పది నిముషాలలో స్నానం ముగించి డైనింగ్ టేబిల్ దగ్గరకెళ్తూ పిలిచాడు.

“మధూ! అన్నం పెట్టు”

ఆమె ఒక్క క్షణం తల తిప్పి అతన్ని చూస్తూ అంది “అరె! మీరు భోజనం చెయ్యలేదా? ఇంత రాత్రి వరకు ఇంటికి రాకపోతే మీ ఫ్రెండ్స్‌తో బయట తినేసి వచ్చారనుకున్నాను. అందుకే నేను భోజనం చేసి మిగతా వంట వాచ్‌మేన్‌కి ఇచ్చేసాను”

అతని కడుపులో ఆకలి కరకరలాడుతోంది. ఆకలి కంటే భార్య తనని నిర్లక్ష్యం చేస్తోందనే వేదనే మనసుని మండిస్తోంది. ఇటీవల కాలంలో భార్య ప్రవర్తనలో వచ్చిన మార్పుకి అసహనంతో రగిలిపోతున్న అతను ఆగ్రహంతో అరిచాడు.

“నేను భోజనానికి ఇంటికి రానని నీతో చెప్పానా?”

“రాత్రి పది గంటలు దాటితే ఫ్రెండ్స్‌తో బయట తిని రావడం మీకు అలవాటేగా?” ప్రశాంతంగా జవాబిచ్చింది.

“ఎందుకిలా ప్రవర్తిస్తున్నావ్ నువ్వు? కనీసం నేను భోజనం చేసానో లేదో కూడా పట్టించుకోకుండా?” తీవ్రస్వరంతో అడిగాడు.

“ఏమిటండీ మీరు! చిన్న విషయానికెందుకింత రాద్ధాంతం చేస్తారు? మీరు బయట తినేసి వస్తారేమో వంట పొద్దుటకి పాడవుతుందని వాచ్‌మేన్‌కి ఇచ్చాను. తప్పా? అంతగా ఆకలయితే ఫ్రిజ్‌లో

పాలున్నాయి తాగండి" అనేసి మళ్ళీ టి.వి. చూడ టంలో లీనమయింది.

ఒక్కంగలో ఆమెని సమీపించి, ఆమె చేతిలో నుంచి రిమోట్ లాక్కుని టి.వి.ఆఫ్ చేసాడు.


"ఏమిటిది, టి.వి. చూడ్డానికి కూడా నాకు మీ పర్మిషన్ కావాలా?" అతని చేతిలో నుంచి రిమోట్ లాక్కోబోయింది.

అంతే! ఆమె చెంప ఛెళ్ళుమంది.

ఆమె చేష్టలు దక్కి నిలబడిపోయింది.

"నీకు పొగరు ఎక్కువైంది. నాకు జ్వరమొస్తే పట్టించుకోకుండా నర్సుకి నన్ను అప్పగించి ఫ్రెండ్స్‌తో షికార్లు కొడతావా? నా ఆకలిని పట్టించు కోకుండా పీకలదాకా తిని టి.వి.చూస్తూ కూర్చుం టావా? పొగరే కాదు నీకు నిర్లక్ష్యం కూడా పెరిగిపో యింది. కట్టుకున్న మొగుడిని పట్టించుకోడానికి తీరిక లేదా?" అవధులు దాటిన ఆగ్రహంతో అరి చాడు.

నవ్వింది మాధుర్య. "ఇరవై రోజులు... ఒక్క ఇరవై రోజులు మిమ్మల్ని నిర్లక్ష్యం చేస్తే తట్టుకోలేకపో తున్నారే? అలాంటిది మన పెళ్ళయిన ఈ మూడే ళ్ళలో కొత్తలో ఆరు నెలలు తప్ప నన్ను పట్టించుకు న్నారా? నేను అనే దాన్ని ఈ ఇంట్లో వున్నానని మర చిపోయి అర్ధరాత్రి ఇంటికి వచ్చి ఫ్రెండ్స్‌తో బయట తిన్నానని చెప్పి కనీసం నేను తిన్నానో లేదో అడ



క్కుండా నాపై మీ కోరిక తీర్చుకుని నిద్రపోయేవారే! అప్పుడు నేనెంత బాధపడ్డాను."

"అందుకని...ఇలా బదులు తీర్చుకుంటున్నావ న్నమాట!" నిరసనగా హేళనగా అన్నాడు.

"కాదు. నేను పడ్డ బాధేమిటో ప్రాక్టికల్‌గా మీకు తెలియచెప్పాలనుకున్నాను. మీకు జ్వరం వస్తే రాత్రింబగళ్ళు మిమ్మల్ని కనిపెట్టుకుని, నేను మీకు సపర్యలు చెయ్యాలి. అదే నాకు జ్వరం వస్తే మీరు నన్ను పట్టించుకోరు. నాకు జ్వరం వచ్చి లేవలేక, పడుకుని వుంటే ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళిపోతారు. కాసేపు నా దగ్గర కూర్చోండి అని ఎంతో ఆశగా

## లక్ష్మీ సెలీనా

*ఇప్పటికే ఓ హాలీవుడ్ సినిమాలో నటించ డానికి ఎన్నికైన సెలీనా జైట్లీకి మరో ఆంగ్ల సినిమాలో కూడా ముఖ్యపాత్ర లభించిందిట. దీంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్న సెలీనాకి తనకి ఈ సంవత్సరం బాగా అచ్చొచ్చిన సంవత్సరం అని సంబరపడుతోంది. ఇటీవల వచ్చిన హిందీ సినిమా 'రెడ్' కూడా సెలీనాకి పాపులారిటీ తెచ్చిపెట్టింది. ఇప్పుడు వరసగా హాలీవుడ్ చాన్సులు ఆమెని వెతుక్కుంటూ వస్తున్నాయి. అదృష్టమంటే ఇదే మరి!*

అడిగితే నేను నీ పక్కన కూర్చుంటే నీ జ్వరం తగ్గిపో తుందా? అని అడిగారు. పైగా నన్ను చూడ్డానికి వచ్చిన డాక్టరుతో నాకెదురు గానే మా ఆవిడ నిన్న టి.వి.లో ఆవిడకిష్టమైన తెలుగు డైలీ సీరియల్ చూడ లేకపోయాననే బెంగతో జ్వరం తెచ్చుకుందని జోక్ చేసారు" మధ్యలో విష్ణు ఏదో చెప్పబోయాడు. ఆమె చెయ్యెత్తి అతన్ని వారిస్తూ అంది.

"నేను లంఖణం చేస్తే మీరు కూడా పస్తు వుండక్క ర్లేదు. నేను ఒళ్ళు నెప్పులతో బాధపడుతుంటే మిమ్మల్ని నా కాళ్ళు పట్టమని అడగ లేదు. కనీసం నా పక్కన అయిదు నిముషాలు కూర్చోవచ్చుగా? నా చేత టేబ్లెట్ మింగించవచ్చుగా? నిర్లక్ష్యం! నేనూ మీలాగే ప్రవర్తిస్తే... అందుకే! అందుకే నేనూ మిమ్మల్ని పట్టిం చుకోలేదు. కాదు అలా నటించాను. మీకు కావలసి నవన్నీ అమరుస్తూనే మిమ్మల్ని పట్టించుకోనట్టు నటించడానికి మనసు చంపుకున్నాను. ఒక నర్స్‌గా మీకు సపర్యలు చేస్తూనే ఫ్రెండ్‌తో కలిసి షాపింగ్‌కి వెళ్ళాలని మిమ్మల్ని నమ్మించాను. నిజానికి ఆరోజు నేను బయట లాన్‌లో కూర్చుని ఇంట్లో వున్న మీరేం చేస్తున్నారో గమనిస్తూనే వున్నాను. ఒంటరితనంతో యుద్ధం చేస్తున్న మీలోని అశాంతిని అలజడిని గమ నిస్తూనే వున్నాను. కానీ అది చాలదు. ఇన్నాళ్ళూ మీ మౌనంతో ఆ నిశ్శబ్దంలో నేను ఎంత అశాంతికి లోనయ్యానో మీకు ఇంకా బాగా అర్థమవ్వాలి. అందుకే ఇలా ప్రవర్తించాను"

"జ్వరం వచ్చినప్పుడు నాకు సేవ చేసింది నువ్వా? నర్సు కాదా?" అప్రయత్నంగా అడిగాడు.

తల పంకించింది. "భార్య, భర్తకి సేవ చెయ్యడం ధర్మం. అతని నుంచి ప్రతిఫలాన్నో కృతజ్ఞతనో ఆశించి ఆమె అతనికి సేవ చెయ్యదు. కానీ ప్రతిగా అతని నుంచి అదే ఆదరణను ఆశించడం తప్పా?" ఆమె స్వరంలో ఆవేశం లేదు. మంచుకన్నా చల్లనైన భావమేదో వుంది. అది అతన్ని వణికింపజేస్తోంది.

"మీ ఫ్రెండ్స్‌తో గంటల తరబడి మాట్లాడే మీకు నాతో అయిదు నిముషాలు మాట్లాడే తీరిక వుండదు. మీ మౌనాన్ని ఈ నిశ్శబ్దాన్ని నేను భరించ లేకపోతున్నాను. ఈ మౌనం మనిద్దరి మధ్య దూరాన్ని పెంచుతోంది. నన్ను ఒంటరితనం అనే లోయలోకి విసిరేస్తోంది. మౌనం తర్వాత అంతా శూన్యమే. ఆ శూన్యంలో నాకు ఆలంబన దొరుకు తుందేమోనని ఆర్తిగా వెతుక్కుంటున్నాను నేను. ఆ ప్రయత్నంలో మీకు దూరమయిపోతానేమోననే భయం. తప్పు చేస్తానేమో అని నాపై నాకు అపన మ్మకం" క్రమేపీ ఆమె స్వరం గాద్గదికమయింది. ఉన్నట్టుండి చేతుల మధ్య ముఖాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

విష్ణు ముఖంలో రంగులు మారుతున్నాయి. సిగ్గు, పశ్చాత్తాపం కలగలిసిన భావం అతని ముఖంలో వ్యక్తమవుతోంది. చలి జ్వరం వచ్చినవా డిలా నిలువెల్లా కంపిస్తున్న అతను ఒక్కంగలో ఆమెని సమీపించి ఆమెని గుండెలకి హత్తుకున్నాడు.

'క్షమించు మధూ' అని అతనడగలేదు. కానీ ఆమెని అల్లుకున్న అతని చేతులు ఆమె తలపై వర్షి స్తున్న అతని కన్నీళ్ళు ఆమెని క్షమార్పణ కోరాయి.

ఆ ఇద్దరి మధ్యా ఇప్పుడూ మౌనమే. ఇప్పుడా మౌనంలో ఎన్నో భావాలు, మరెన్నో రాగాలు.

★